క్లుప్తంగా

280 పశువులకు టీకాలు



బర్లిలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో 280పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు గణేష్ తెలిపారు. పశువులకు నోటివెంట చొంగకారడం, నాలిక్నపై బొబ్బర్లు, అధిక జ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, కాలి గిత్తల మధ్య పుళ్లు వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. వాటి నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేటలో పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడికలు తీయిస్తున్న కార్యదర్శి

బలిజిపేట: మండలకేంద్రంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ రాఘలత ఆధ్వర్యంలో గ్రామంలో వీధికాలువలలో పూడుకుపోయిన చెత్తచెదారాలను తొలగిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. గ్రామంలోని కాలువలలో పూడుకుపోయిన చెత్తను తొలగించి అది ఎండిపోయిన తరువాత ఎత్తివేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని అన్ని వీధుల్లో తొలగింపులు చేపడతామని చెప్పారు.

చురుగ్గా గంగందొరవలస - కురుకూటి రోడ్డు పనులు



రహదారి మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు

సాలూరు: మండలంలోని గంగందొరవలస - కురుకూటి డబుల్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు 937 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నామని ఆర్అండ్‌బీ జేఈ విజయ్‌కుమార్ తెలిపారు. గంగందొరవలస నుంచి కురుకూటి వరకు 11 కల్వర్టు పనులు చేపట్టాల్సి ఉండగా.. ప్రస్తుతం గంగందొరవలస నుంచి దండిగాం జంక్షన్ వరకు మూడు కిలోమీటర్లలో ఆరు కల్వర్టు పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది నవంబర్ కల్లా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దండిగాం వద్ద బ్రిడ్జి మంజూరైందని, సుమారు 11 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలిచామని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



సత్యసాయి పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సాలూరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యసాయి కళాశాల, వాసవీ కళాశాల, పీఎన్ బొడ్డవలస కళాశాల పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.

సాలూరులో చిరుజల్లులు



పట్టణంలో కురుస్తున్న చిరుజల్లులు

సాలూరు: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం చిరుజల్లులు కురిశాయి. భానుడి తాపంతో కొద్ది రోజులుగా ఉక్కబోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. చిరు జల్లులు కురవడంతో ప్రజలు కాస్త సేదదీరారు.

20న వాహనాల వేలం

సాలూరు: వివిధ సారా కేసులలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 20న వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సారా తరలిస్తూ పట్టుబడిన 19 వాహనాలకు రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

అమరజీవి సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



సీతానగరం: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

సీతానగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలు స్ఫూర్తి దాయకమని ఆర్య వైశ్య సేవాసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం విశ్వేశ్వరరావు కొనియాడారు. ఈ మేరకు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పురస్కరించుకుని పెద భోగిలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆర్య వైశ్యుల సంక్షేమానికి ప్రఖ్యాతులు తెచ్చిన మహనీయుడని పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆయన ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాసవీక్లబ్ ప్రతినిధి అరిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కట్టుబడి ఉందామని కోరారు, కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం, వాసవీక్లబ్ సభ్యులు కె.లక్ష్మణరావు, ఏవీ గోవిందరావు, జి వెంకటరావు, కె.దేవుళ్లు, ఎం .వెంకటరమణ, ఎస్ రమేష్, శంకరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్,పెన్నుల వితరణ

పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వాసవీక్లబ్ సభ్యులు స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఏటా మహనీయుడి జయంతి సందర్భంగా విద్యార్థులకు వితరణ చేస్తున్నామని క్లబ్ సభ్యుడు కె.లక్ష్మణరావు అన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళి

బలిజిపేట: ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుని సేవలు మరుపురానివని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు తెలిపారు. మండలంలోని పెదపెంకిలో ఆర్యవైశ్య కల్యాణమంటపం వద్ద పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుడని అటువంటి వ్యక్తి జయంతిని నిర్వహించి నివాళులర్పించడం మనందరి విధి అని తెలిపారు. ఎంతోమంది మహానుభావులు ఉన్నప్పటికీ పొట్టి శ్రీరాములు మనకు మహోపకారం చేశారని కొనియాడారు. విద్యార్థులకు ఇటువంటి మహనీయుని గాథలు తెలియవలసి ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.బాబు, జి.శ్రావణ్, కె.శ్రీరాములు, పి.పరశురామ్, కె.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన గ్రామస్తులు



పార్వతీపురం టౌన్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గౌరవ వందనం చేస్తున్న అదనపు ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్‌కిరణ్

పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి

పార్వతీపురం టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు, ప్రాణత్యాగం మరువలేనివని అదనపు ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు, ప్రాణత్యాగం గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరంకితం అవుదామని పోలీస్ సిబ్బందికి అదనపు ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, జిల్లా ఆర్మ్‌డ్ అధికారులు, పోలీస్ సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో విద్యుద్దీకరణ

సీతానగరం: మండలంలోని జగనన్న లే అవుట్లలో విద్యుద్దీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన బుడ్డిపేట జగనన్న లే అవుట్‌లలో జరుగుతున్న విద్యుద్దీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 53 జగనన్న లే అవుట్‌లున్నాయని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చిన లేఅవుట్లలో విద్యుద్దీకరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఏగోటివలస, కాశీపేట, సూరంపేట, అప్పయ్యపేట, జోగింపేట, గుచ్చిమి గ్రామాల్లో విద్యుద్దీకరణ పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. తాజాగా బుడ్డిపేటలో పవర్‌లైన్, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సభ్యుడు ఎస్.వెంకటరమణ, విద్యుత్ శాఖ అధికార సిబ్బంది పాల్గొన్నారు.



బుడ్డిపేట జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్ కుమార్

పార్వతీపురం టౌన్: హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖవ్యాధులపై జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, సాథి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా పార్వతీపురం సబ్ జైల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఎయిడ్స్, లెప్రసీ)డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ జీవితాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని ప్రతి ఒక్కరూ నమ్మాలని కోరారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి. బాలాజీ హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ అప్పలనారాయణ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, జిల్లా ఆస్పత్రి సుఖవ్యాధి చికిత్స కేంద్రం కౌన్సిలర్ యు.రామారావు, సాథి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.మేనక పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ

సీతానగరం: మండలకేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం . స్వామివారిని దర్శించుకునేందుకు వేకువ జామునుంచే పూజా సామగ్రితో దూర ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు రాకముందే స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి బ్యాచ్‌లుగా విభజించి అర్చన చేయిస్తామని చెప్పారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు పర్యవేక్షణలో తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

మోటార్లతో మురుగునీరు తొలగింపు



మోటార్‌తో మురుగునీరు తోడిస్తున్న దృశ్యం

సాలూరు: మండలంలోని మామిడిపల్లిలో కాలువల్లో నిల్వ ఉన్న మురుగునీటిని మోటార్లతో గురువారం తోడించారు. కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక సర్పంచ్ సువ్వాడ శశికళ ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయితే తాత్కాలికంగా సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో సర్పంచ్ దగ్గరుండి మోటార్లతో మురుగునీరు తొలగించడంతో, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం

పాచిపెంట: సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 20న వేలం వేయనున్నట్లు ఎస్సై వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో 13 ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నామని, ఆసక్తిగల వారు ఆధార్‌కార్డుతో సహా హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా..

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు, అదేవిధంగా పద్మాపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి మూడు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐటీడీఏ ఏటీడబ్ల్యూ శ్రీనివాసరావు గురువారం ఆయా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల పోస్టర్లలో లబ్ధిదారుల జాబితాలు, ప్రభుత్వానికి, అధికారులకు సంబంధించిన ఫోన్ నంబర్లతో పాటు ఫిర్యాదుదారుల ఫోన్ నంబర్లు కూడా ప్రదర్శించాలని సూచించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తుదివరకు లబ్ధిదారులకు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు

నోటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: నోటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని జిల్లా ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. అందులో భాగంగా నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఈ సందర్భంగా మాట్లాడుతూ నోటి ఆరోగ్యంపై అవగాహన అవసరమని సూచించారు. చిన్నప్పటి నుంచి నోటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. నోటిలో పళ్ల ఎంతో పటుత్వమైనవని, అయితే తగిన పోషణ లేక అనారోగ్యం పాలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి రోజు ఉదయం , రాత్రి రెండు పూటల దంతాలను శుభ్రం చేసుకోవాలని హితవు పలికారు. ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యుడిని సంప్రదించడం అవసరమన్నారు. సరైన శ్రద్ధ వహించకపోవడం, పొగతాగడం వంటి కారణాల వల్ల నోటి కేన్సర్ తదితర రోగాలకు గురవుతున్నామని చెప్పారు. బ్రష్ చేసే విధానంపైనా, వినియోగించే పేస్టు పైనా అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి పండగ



ఘటాలతో తిరువీధిలో పాల్గొన్న ఎంపీపీ బి.రమణమ్మ

సీతానగరం: మండలంలోని పెదంకలాంలో ఎల్లమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ మేరకు బుధవారం గుడినుంచి ఘటాలతో ఎల్లమ్మ తల్లి ఊరేగించి తీసుకువచ్చి అంగడివద్ద ఉంచారు. గురువారం ఉదయం అంగడి నుంచి ఎల్లమ్మతల్లి గుడివరకూ ఎల్లమమ్మతల్లి చరిత్రను ఆటపాటల రూపంలో నృత్య ప్రదర్శనలతో అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లారు.

వేలాది మంది భక్తులు పూజా సామగ్రితో ఘటాల వెంట వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. చీరలు, పసుపుకుంకుమలతో పాటు కోడిగుడ్లు అమ్మవారికి భక్తులు సమర్పించారు.

కనులపండువగా కోటదుర్గ ఆలయ పునఃప్రారంభం

- వీరఘట్టంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

వీరఘట్టం: మండల కేంద్రంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన శ్రీకోటదుర్గ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని కనుల పండువగా గురువారం నిర్వహించారు. దీంతో వీరఘట్టం పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో తొలి రోజు దేవతా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛత్రయం, పంచగవ్య ఆరాధన, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణ ప్రధానం,యాగశాల ప్రవేశ ద్వార పూజ, ధ్వజ పతాకావిష్కరణ, మండల మండపారాధనలు, జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకు ముందు ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన సుమారు 250 మంది దాతలు సతీసమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీక్షా వస్త్రాలు ధరించి వచ్చిన దంపతులకు వేద పండితులు దీక్షా కంకణాలు కట్టారు. మూడు రోజుల పాటు జరగనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దంపతులు పాల్గొనాలని వేదపండితులు సూచించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించిన రాజమండ్రికి చెందిన శిల్పి తమ్మినేని అశోక్, పార్వతీపురానికి చెందిన వెల్డర్ యాండ్రాపు హరిలను శర్మయాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు బంగారు కంఠాభరణాలతో సత్కరించారు. అనంతరం పంచలోహాలతో తయారు చేసిన 108 కిలోల కోటదుర్గ తల్లి ఉత్సవ విగ్రహాన్ని సాయంత్రం ఊరంతా ఊరేగించారు. దీంతో దుర్గాదేవి నామస్మరణతో వీరఘట్టం పట్టణం మారుమోగింది.



పూజలందుకుంటున్న కోటదుర్గ తల్లి 108 కిలోల పంచలోహ విగ్రహం



ధాన్యాధివాసం పూజకు సిద్ధం చేసిన ప్రత్యేక అలంకరణ

ముగిసిన డోలోత్సవాలు

భామిని:

మండలంలోని లివిరిలో వెలిసిన శ్రీగోపినాథ రాధాకృష్ణుల డోలోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణుల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆంధ్రా - ఒడిశాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు.



ప్రత్యేకంగా అలంకరించిన మూలవిరాట్‌లు

రహదారులపై వ్యాపారం

- పాదచారులకు తప్పని అవస్థలు
- అధికారులు చెబుతున్నా పట్టించుకోని వ్యాపారస్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రహదారులు ఆక్రమణకు గురయ్యాయి. వ్యాపారం పేరుతో తోపుడుబండ్లు, డీజిల్ ఆటోలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. పట్టణంలో రోజురోజుకూ జనాభా అధికమవుతున్న తరుణంలో రానున్న రోజుల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలతో పెద్ద సమస్య వచ్చి పడే ప్రమాదం ఉంది. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా వ్యాపారులు ఆక్రమించారు. ఉదయం 9 గంటలు మొదలుకుని రాత్రి వరకు ఫుట్‌పాత్‌లో జోరుగా వ్యాపారాలు జరుగుతున్నాయి. పూలు, పండ్లు, కూరగాయలు, మొక్కలు, డ్రైఫ్రూట్స్, క్యాంటీన్, చికెన్ కార్నర్స్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు రోడ్డుకడ్డంగా వాహనాలు ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నాలుగు రోడ్ల కూడలి వద్ద గల రైతు బజార్‌కు నిత్యం వందలాది మంది కూరగాయల కొనుగోలుకు వస్తుంటారు. అలాగే ఆస్పత్రి ముందు పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, అంబులెన్సులు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు నడిచేందుకు వీలులేని పరిస్థితి. ఆ ప్రాంతం నుంచి ఆర్‌డీఓ, అగ్నిమాపక కార్యాలయాలకు పాదాచారులు, వాహనదారులు వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా రోడ్లకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. పట్టణ శివారు బెలగాం ప్రాంతం వద్ద ప్రధాన రహదారిపై అనధికారికంగా చేపల మార్కెట్ నిర్వహిస్తుండంతో రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీని వల్ల పెను ప్రమాదం సంభవించే ఆస్కారం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోని వ్యాపారస్తులు

ప్రధాన రహదారి ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఈ ఆక్రమణల వల్ల జరిగే ప్రమాదాలు, కలిగే ట్రాఫిక్ అంతరాయాన్ని వివరించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ముందుచూపు లేకుండా వ్యాపారులు వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్తులో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతుందని పట్టణ వాసులు అంటున్నారు.





రోడ్డుపై వెలిసిన దుకాణాలు

చర్యలు తీసుకుంటాం

రహదారులు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే పలుమార్లు ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సమావేశాలు నిర్వహించాం. రహదారులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. – రామప్పల నాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం